సాక్షి
నిజామాబాద్
శుక్రవారం। 6। సెప్టెంబర్। 2024



రెండు స్టేడియంలు..

జిల్లా కేంద్రంలో ఇండోర్, ఎనిమిది ట్రాక్‌లతో స్టేడియాలు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు.

- 8లో ▸



మధ్యవర్తిత్వంతో పరిష్కారం

కొలిక్కిరాని ఎన్నో సమస్యలు మధ్యవర్తిత్వంతో పరిష్కారమవుతాయని జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.4 /22.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్లు





నిజామాబాద్‌అర్బన్: జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, కిరణ్మయి కొప్పిశెట్టి గురువారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు.

వికాస్ మహతో బాధ్యతల స్వీకరణ..



బోధన్: బోధన్ సబ్ కలెక్టర్‌గా యువ ఐఏ ఎస్ అధికారి వికాస్ మహతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. జార్ఖండ్ రాష్ట్రాని కి చెందిన వికాస్ మహతో 2022 ఐఏఎస్ బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ ఆయనకు బాధ్యతలు అప్పగించా రు. ఈ సందర్భంగా ఆర్డీవోతో పాటు తహశీల్దార్ విఠల్, ఉద్యోగులు పుష్పగుచ్ఛా లు అందజేసి వికాస్ మహతోకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటెక్ పూర్తి చేసిన తరువాత కెమికల్ ఇంజినీర్‌గా పని చేశానని, ఐఏఎస్ సాధించిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా శిక్షణ పొందినట్లు తెలిపారు. డివిజన్ ప్రజలకు పారదర్శక, మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.

తగ్గుముఖం పట్టిన వర్షం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో వర్షం తగ్గుముఖం పట్టింది. గురువారం జిల్లా వ్యాప్తంగా అతి తక్కువగా 5.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. నవీపేట మండలంలో 19.0 మి.మీ., నందిపేటలో 4.3, ఎడపల్లిలో 9.4, మోస్రాలో 18.2, బోధన్‌లో 17.9, సాలూరలో 17.0, మోపాల్‌లో 12.4 నిజామాబాద్ రూరల్‌లో 11.3 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది. కాగా, గురువారం రాత్రి ఆకాశంలో ఉరుములు, మెరుపులు వచ్చాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతవరణ కేంద్రం తెలిపింది.

పక్కా ప్రణాళికతో నష్ట నివారణ చర్యలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో భారీ వర్షాలు కురిసినప్పటికీ పక్కా ప్రణాళికతో పని చేశామని, ఆస్తి, ప్రాణ నష్టానికి తావులేకుండా చర్యలు తీసుకున్నామని ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ ఆర్ మధుసూధన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పారుదల శాఖ పరిధిలో ఉన్న 1086 పెద్ద, చిన్న చెరువులు, 51 చెక్ డ్యామ్‌లు, రామడుగు ప్రాజెక్ట్, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద చేరిందని పేర్కొన్నారు. పెద్దవాగు, కప్పలవాగు, పసుపు వాగు, పూలాంగ్ వాగుల్లోకి వరద పోటెత్తిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి పర్యవేక్షణలో వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి క్షేత్రస్థాయి అధికారుల సహకారంతో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి అవసరాలతోపాటు ఖరీఫ్, రబీ పంటలకు పక్కా ప్రణాళికతో నీటిని విడుదల చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నిజాంసాగర్ మూడు గేట్లు ఎత్తివేత



నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో నిజాంసాగర్ ప్రాజెక్టు మరో రెండు వరద గేట్లను గురువారం ఎత్తారు. మూడు గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.50 అడుగుల (17.079 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండటంతో అంతేమేర నీటిని మంజీరలోకి వదులుతున్నారు.

'సింగూరు' నీటి విడుదల

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు గేట్లను గురువారం మధ్యాహ్నం ఎత్తారు. రెండు వరద గేట్లను ఎత్తి 16,284 క్యూసెక్కులు, జెన్‌కో గేట్ల ద్వారా 2,822 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు.

మట్టి గణపతికే జై



ఇందూరులోని వినాయక్‌నగర్‌లో హైందవ ఉత్సవ సమితి వారు రాయ్‌పూర్ నుంచి తెచ్చిన 15 అడుగుల మట్టి విగ్రహం



ఆర్మూర్‌లో 33 అడుగుల మట్టి విగ్రహం తయారీ దృశ్యం


సర్వజీవులన్నీ మట్టిలోనే లయమవుతాయి. ఇదే సృష్టి రహస్యం. ఈ యదార్థాన్ని గుర్తిస్తూ జిల్లాలోని పలు గణేశ్ మండళ్ల వారు మట్టి గణపతులను ప్రతిష్ఠిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణ సమతుల్యాన్ని రక్షించడంలో భాగస్వాములవుతున్నారు.

- పురాణాలను గౌరవిద్దాం.. సంప్రదాయంగా నవరాత్రులు చేద్దాం
- మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- జిల్లాలో పలుచోట్ల మట్టి విగ్రహాలను నిలుపుతూ ఆదర్శంగా నిలుస్తున్న ఉత్సవ సమితులు
- రేపు వినాయక చవితి.. కొలువుదీరనున్న గణనాథులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సనాతన ధర్మంలో చేసే ప్రతి పనికి, కార్యానికి, వ్యవహారానికి, క్రతువుకు ఒక అర్థం ఉంటుంది. ప్రతి ఒక్క అంశం మానవుడితో పాటు ప్రతి జీవి మనుగడకు సంబంధించిన జీవవైవిధ్యానికి ముడిపడి ఉంటుంది. ఆది దంపతులైన శివపార్వతుల పుత్రుడు గణపతికి మొదటి పూజ చేయడం సనాతన సంప్రదాయంలో కీలకం. పంచభూతాలన్నింటిలోనూ పరమేశ్వరుడు ఉన్నాడు. అన్నింటా అంతర్లీనంగా వినాయకుడు ఉన్నాడు. ఇక విశ్వవ్యాపకత్వం కలిగి ఉన్నది మట్టి ఒక్కటే. ఈ మట్టి నుంచే సకల జీవులు సృష్టించబడ్డాయి. మట్టి ద్వారా లభించే పోషకపదార్థాల ద్వారానే సర్వజీవులు పోషించబడుతున్నాయి. చివరకు సర్వజీవులన్నీ మట్టిలోనే లయమవుతున్నాయి. ఇదే సృష్టి రహస్యం. ఇదే పరబ్రహ్మతత్వం. ఈ సత్యం చాటేందుకే పరమశివుడు పరబ్రహ్మ స్థూల రూపమైన భూమి నుంచి మట్టిని తీసి విగ్రహం చేసి ప్రాణం పోశాడు. లింగపురాణంలోని గణేశఖండం ప్రకారం శివుడే వినాయకుడి రూపాన్ని మట్టితో తయారు చేశాడు. మృత్తికయే పరబ్రహ్మం కనుక మట్టితో వినాయకుడిని చేసి పరబ్రహ్మ స్వరూపంగా పూజించడం ఆనవాయితీగా వస్తోంది. అంతేకాక మట్టి పేద, ధనిక తేడా లేకుండా అందరికీ లభిస్తుంది. సర్వసమానత్వానికి ఏకైక తార్కాణం భూమి, మట్టి, వసుధ. విఘ్నేశ్వరుడు అందరివాడు. సర్వజీవ సమానత్వానికి ప్రతీక మట్టి వినాయకుడు. అందుకే మట్టి వినాయకుడికి ప్రాధాన్యత ఇవ్వాలనేది పురాణాలు చెప్పే సత్యం.

మట్టి గణపతులతో ఉత్సవాలు..

- ఇందూరు వినాయక్‌నగర్‌లోని హైందవ ఉత్సవ సమితి ఈసారి పూర్తి పర్యావరణ హితంగా నవరాత్రులకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో 15 అడుగుల మట్టి విగ్రహాన్ని తయారు చేయించి తీసుకొచ్చారు. పర్యావరణ హిత రంగులనే వాడారు.
- ఇందూరు పోచమ్మ గల్లీలో రవితేజ యూత్ సొసైటీ వారు గత 8 సంవత్సరాలుగా 60 అడుగుల మట్టి విగ్రహాన్ని బెంగాల్ కళాకారులతో తయారు చేయిస్తున్నారు.
- ఆర్మూర్ పెద్దబజార్‌లో విశ్వసేన యూత్ ఆధ్వర్యంలో గత 6 సంవత్సరాలుగా మట్టి విగ్రహం తయారు చేస్తున్నారు. ఈసారి 33 అడుగుల మట్టి విగ్రహం చేయిస్తున్నారు.
- నందిపేట మండలం ఉమ్మెడ గ్రామంలో బుచ్చ శ్రీధర్ అనే భక్తుడు గత 9 ఏళ్లుగా మట్టి గణపతిని తయారు చేయించి గ్రామానికి అందిస్తున్నాడు.
- బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీలో హెడ్ పోస్టాఫీస్ వద్ద ప్రతి ఏటా మట్టి గణపతిని ఏర్పాటు చేసి నవరాత్రులు చేస్తున్నారు.
- ఇందూరు రూరల్ పరిధిలోని గండారంలో బాలాజీ గణేశ్ మండలి, మల్కాపూర్‌లో శివపుత్ర గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా మట్టి గణపతులను ప్రతిష్ఠ చేసి ఉత్సవాలు చేస్తున్నారు.
- కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూరులో గత 8 ఏళ్లుగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ యూత్, చౌట్‌పల్లిలో శరత్ ఫ్రెండ్స్ యూత్, బషీరాబాద్‌లో కాశీ బాగ్ హనుమాన్ యువజన సంఘం, బాల్కొండ మండల కేంద్రంలో నవయుగ యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రులు నిర్వహిస్తున్నారు.
- ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ దేవి యూత్ వారు కొన్నేళ్లుగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నారు.
- ఇదిలా ఉండగా జిల్లాలో పలువురు వ్యక్తు లు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఇళ్లలో పూ జలు చేసుకునేవారికి ఉచితంగా మట్టి వినా యక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు.



మట్టి, గడ్డితో రాయ్‌పూర్‌లో విగ్రహం తయారీ సమయంలో..

సంప్రదాయాలు పాటించాలి



సనాతన ధర్మ సంస్కృతిలో ప్రతిదానికీ ఒక పరమార్థం ఉంది. అందుకు అనుగుణంగా సంప్రదాయాన్ని పాటిస్తేనే తగిన ఫలితం ఉంటుంది. నిష్ఠతో పూజ చేయడంతో పాటు మండపాల వద్ద సంప్రదాయ దుస్తులతో, ఆధ్యాత్మిక శ్లోకాలు, పాటలు పాడుకోవాలి. సినిమా పాటలు, అసభ్య నృత్యాలు చేయకూడదు. మద్యం తాగవద్దు. అదేవిధంగా సినిమాలను అనుకరించి బాహుబలి, గబ్బర్‌సింగ్, పుష్ప ఆకారాలతో కూడిన వికృత రూపాల్లో గణపతి విగ్రహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేయకూడదు. – ధాత్రిక రమేశ్, వీహెచ్‌పీ జిల్లా సహకార్యదర్శి

విషరసాయనాలతో చేసిన విగ్రహాలు సరికాదు



భవిష్యత్తు తరాలకు మేలు కలిగే విధంగా ప్రతిఒక్కరూ వ్యవహరించాలి. విష రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను, ప్రమాదకరమైన ప్రకృతికి నష్టం చేసే రంగులను వాడడం మానాలి. తక్షణమే నీటిలో కలిసిపోయేవిధంగా విగ్రహాలను ప్రతిష్ఠించుకుని, శాస్త్రబద్ధంగా నిమజ్జనం చేసుకోవాలి. పోటీతత్వంతో కాకుండా గ్రామం, కాలనీలో అందరూ కలిసి ఐకమత్యంతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి. ఒకే కాలనీలో అనేక చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఐక్యతను తద్వారా సంప్రదాయాలను దెబ్బతీసుకోవద్దు. భావి పౌరులకు ఆదర్శంగా నిలవాలి. – అర్జున్, వినాయక్‌నగర్

కోరికలు తీర్చే సత్య గణపతి

- పాలాజ్‌లో మాదిరిగా డొంకేశ్వర్‌లో చెక్క విగ్రహం
- ప్రతి ఏటా ఘనంగా చవితి ఉత్సవాలు
- ఏడవ వార్షికోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్న సర్వ సమాజ్ కమిటీ



డొంకేశ్వర్‌లోని చెక్క గణపతి

డొంకేశ్వర్(ఆర్మూర్) : మహారాష్ట్రలోని పాలాజ్‌లో మాదిరిగా చెక్కతో తయారు చేసిన విఘ్నేశ్వరుడు డొంకేశ్వర్‌లో ప్రత్యేకం. భక్తుల కోర్కెలు తీర్చే 'సత్య గణపతి'గా పిలువబడుతున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతి ఏడాది ఘనంగా ఉత్సవాలు జరుగుతాయి. ఏడవ వార్షికోత్సవ ఉత్సవాలను ఈసారి మరింత భారీగా నిర్వహించడానికి 'సర్వ సమాజ్ కమిటీ' బాధ్యతలు తీసుకుంది.

2018 నుంచి మొదలు...

మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పాలాజ్ (చెక్క) గణపతి ఎంతో ప్రసిద్ధి. వినాయక చవితి నవరాత్రుల్లో మాత్రమే గుడి తెరిచి ఉండే పాలాజ్ గణపతిని దర్శించుకోవడానికి ఎక్కడెక్కడి నుంచో భక్తులు వెళ్తుంటారు. అలాగే డొంకేశ్వర్ నుంచి కూడా ఎంతోమంది భక్తులు వెళ్లారు. పాలాజ్‌లో మాదిరిగా డొంకేశ్వర్‌లో కూడా చెక్క గణపతి ఏర్పాటు చేయాలని భావించి 2018లో విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. ఇందుకోసం నిర్మల్ జిల్లా సిద్ధాపూర్‌లో జ్ఞానేశ్వర్ అనే కళాకారుడి వద్ద చెక్కతో గణపతిని తయారు చేయించారు. విగ్రహ తయారీలో మామిడి, తెల్ల జిల్లేడు, ఎర్రచందనం, రాగి చెక్కలను ఉపయోగించారు. అయితే చెక్క గణపతిని నిమజ్జనం చేయకుండా ఉత్సవాలు ముగియగానే రామాలయంలోని ప్రత్యేక గదిలో భద్రపరుస్తారు. ప్రతిఏటా వినాయక చవితి సమయంలోనే గదిని తెరిచి విగ్రహాన్ని తీసుకొచ్చి సత్యగంగవ్వ మండపంలో ప్రతిష్ఠిస్తారు. పదకొండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు భక్తులు అధికంగా సంఖ్యలో వస్తారు. ఉత్సవాలు పవిత్రంగా జరపాలనే ఉద్దేశంతో 100 మందికి పైగా కంకణధారణ చేసి ఒక్క పొద్దులు ఉంటారు. విశిష్ట పూజ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా నిత్య హోమం, అన్నదానం చేస్తారు. ఊరంతా పండుగ వాతావరణం నెలకొంటుంది.

నిష్ఠతో పూజిస్తే కోర్కెలు తీరుతాయి



నిష్ఠతో చెక్క గణపతిని పూజించి మనసులో ఏది కోరుకుంటే అది జరుగుతుందని భక్తుల్లో నమ్మకం ఏర్పడింది. అందుకే చెక్క గణపతికి సత్య గణపతి అనే పేరు వచ్చింది. పదకొండు రోజుల పాటు జరిగే ఉత్సవాలతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ ఏడాది కూడా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథుడి దీవెనలు పొందాలి.

– క్లెంం గంగారెడ్డి, డొంకేశ్వర్

మట్టి గణపతులతో పర్యావరణం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణాన్ని కాపాడే మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సందేశాన్నిస్తూ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 8 అంగుళాల మట్టి గణపతులను అందించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మట్టి గణపతి ద్వారా పర్యావరణ పరిరక్షణపై పాఠశాలలో, కళాశాలల్లో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. చేతి వృత్తుల వారికి మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ, ఆటోల వెనుక పోస్టర్ల ప్రదర్శన, బస్టాప్‌లలో హోర్డింగ్‌ల ఏర్పాటు, కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ అంకిత్ , కమిషనర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు 'ఉత్తమ' అవార్డులు



మంత్రి పొన్నం చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న స్వరూప, మేస నరేందర్, ముద్దుకృష్ణ, సతీశ్

- ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- అవార్డుల అందజేత

నిజామాబాద్ అర్బన్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాకు చెందిన ఆరుగురు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డులను అందుకున్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్తమ టీచర్లను ఘనంగా సన్మానించారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ముద్దుకృష్ణ(దుబ్బ), నరేందర్(ఆలూర్), స్వరూప(ధర్మారం), పెద్దన్న(మోర్తాడ్), సతీశ్(భీమ్‌గల్), బాలమణి (పీఈటీ, గిరిరాజ్) అవార్డులు అందుకున్నారు.

మారిన ఓటరు జాబితా షెడ్యూల్

- 13న ముసాయిదా, 28న తుది ఓటర్ల జాబితా విడుదల

సుభాష్‌నగర్: గ్రామాల్లో వార్డులవారీగా ఓటరు జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో ఇచ్చిన షెడ్యూల్‌ను మారుస్తూ గురువారం ఉత్తర్వులిచ్చింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1తో ముగిసిన విషయంతెలిసిందే. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు వార్డుల వారీగా ఓటరు జాబితా కోసం గత 15 రోజులుగా కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 545 గ్రామపంచాయతీలు, 5020 వార్డు స్థానాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా తయారీ, వార్డుల రూపకల్పన, తదితర అంశాలపై ఇప్పటికే ఎంపీడీవోలు, ఎంపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణనిచ్చిన విషయంతెలిసిందే. వార్డుల వారీగా జాబితా తయారు చేసి, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పాత షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ముసాయిదా జాబితా, 21న తుది జాబితా విడుదల చేయాల్సి ఉండగా, రాష్ట్రంలోని కొన్ని గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా తయారు పూర్తి కాకపోవడంతో ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను మార్చినట్లు జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు. వార్డులవారీగా ఓటరు జా బితా తయారీ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు తెలిసింది.

14 నుంచి అభ్యంతరాల స్వీకరణ

వార్డులవారీ ముసాయిదా ఓటరు జాబితాను గ్రామపంచాయతీ, మండలపరిషత్‌లో ఈనెల 13న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రచురించనుంది. 18న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయిలో, 19న మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించి 14 నుంచి 21వ తేదీవరకూ ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 26న అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. 28న తుది ఓటరు జాబితా విడుదల కానుంది.



మోపాల్‌లో వార్డులవారీగా ఓటరు జాబితా రూపొందిస్తున్న కార్యదర్శి, బీఎల్‌వోలు (ఫైల్)

60 టీఎంసీలు గోదావరిపాలు

- ఎస్సారెస్పీ గేట్ల మూసివేత
- ఎగువ నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో..
- పెరుగుతోన్న ప్రాజెక్టు నీటిమట్టం



గురువారం సాయంత్రం మూసి ఉన్న ఎస్సారెస్పీ వరద గేట్లు

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఎస్సారెస్పీ గేట్లను అధికారులు గురువారం మూసివేసి నీటి విడుదలను నిలిపివేశారు. సోమవారం ఉదయం 10.30 నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 60 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యంలో 70 శాతం నీరు మూడు రోజుల వ్యవధిలో గోదావరి పాలైంది. ఆదివారం ఇన్‌ఫ్లో భారీగా పెరగడంతో సోమవారం ఉదయం నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. 41 వరద గేట్ల ద్వారా గరిష్ఠంగా 3లక్షల 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గురువారం ఉదయం వరద తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ నుంచి కనిష్ఠంగా 25 వేల క్యూసెక్కుల నీటిని వదిలి చివరికి మూసి వేశారు.

కొనసాగుతున్న ఇన్ ఫ్లో

ప్రాజెక్టులోకి ప్రస్తుతం 92వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, 70 టీఎంసీల మట్టానికి చేరుకోగానే గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 500, వరద కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఆవిరి రూపంలో 636 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1089.50(56 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ఐదు రోజుల్లో 80 టీఎంసీలు

ప్రాజెక్టులోకి గడిచిన ఐదు రోజుల వ్యవధిలో 80 టీఎంసీల ఇన్ ఫ్లో వచ్చింది. ఆదివారం ఉదయం 37 వేల క్యూసెక్కులతో ప్రారంభమై సాయంత్రానికి 62 వేల క్యూసెక్కులకు పెరిగింది. అప్పటి నుంచి క్రమంగా పెరుగుతూ సోమవారం ఉదయానికి 2 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో చేరింది. గరిష్ఠంగా 3 లక్షల 15 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 145 టీఎంసీల వరద రాగా, జూన్‌లో 3.995 టీఎంసీలు, జూలైలో 27.25 టీఎంసీలు, ఆగస్టులో 33.48 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది.

తగ్గిన విద్యుదుత్పత్తి

ప్రాజెక్ట్ నుంచి జల విద్యుదుత్పత్తి కేంద్రానికి నీటి విడుదల తగ్గడంతో 35.45 మెగావాట్లకు విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదలను తగ్గించడం కారణంగా విద్యుదుత్పత్తి కేంద్రానికి నీరు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.22 మిలియన్‌యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని జెన్‌కో అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

సుదర్శన్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌లను కలిసిన భాస్కర్‌రెడ్డి



మహేశ్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డితో భాస్కర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నిజామాబాద్‌ డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి గురువారం మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురిని శాలువాతో సన్మానించారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి



బోధన్‌: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని డంపింగ్‌ యార్డును గురువారం పరిశీలించారు. అనంతరం పారిశుధ్యం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎంపీడీవో శంకర్‌ నాయక్, ఎంపీవో మన్మోహన్‌ శర్మ, పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్‌ తదితరులు ఉన్నారు.

చౌకబారు ప్రకటనలు మానుకోవాలి



నిజామాబాద్‌అర్బన్‌: ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు వరద బాధితులకు ఒకరోజు మూల వేతనం విరాళం ఇస్తే కొందరు చౌకబారు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎంప్లాయీస్‌ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలతో నిరాశ్రయులైన వరద బాధితుల కోసం ఆపన్నహస్తం అందించేందుకు రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ముందుకు వస్తే కొన్ని సంఘాలు తమ గొప్పతనమే అంటు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, చిట్టి నారాయణ రెడ్డి, ఎం సతీశ్, జాకీర్‌ హుస్సేన్, ఉమా కిరణ్, పందిరి స్వామి, నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజానికి కృషి



భిక్కనూరు: హెచ్‌ఐవీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ సహాయ సంచాలకులు ప్రసాద్‌ అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలో వైఆర్‌జీ కేర్‌ లింక్‌ వర్కర్‌ స్కీం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఐవీ నివారణ జాగ్రత్తలతోనే హెచ్‌ఐవీ రహిత సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎయిడ్స్‌ నివారణ సంస్థ ప్రతినిధి పీకే పత్ర, జీపీ ఈవో మహేష్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ మేనేజర్‌ చల్ల సుధాకర్, లింక్‌ వర్కర్‌ స్కీం డీఆర్పీ గర్దాస్‌ సుధాకర్, సూపర్‌వైజర్‌ జ్యోతి లింక్‌ వర్కర్లు శివరాం, బాల్‌కిషన్‌ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో రెండు స్టేడియంలు

- అక్టోబర్‌లో శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌
- పాత డ్వాక్రాబజార్‌ స్థలంలో ఇండోర్‌..
- పాత కలెక్టరేట్‌ మైదానంలో ఎనిమిది ట్రాక్‌లతో స్టేడియం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ
- నమూనా మ్యాప్‌ పరిశీలన



నమూనా మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

నిజామాబాద్‌ నాగారం: జిల్లా కేంద్రంలోని పాత డ్వాక్రా బజార్‌ స్థలంలో ఇండోర్, పాత కలెక్టరేట్‌ మైదానంలో 8 ట్రాక్‌లతో స్టేడియంలు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ మైదానాన్ని ఆయన గురువారం పరిశీలించి, స్థితిగతులను తెలుసుకున్నారు. నమూనా మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌ మైదానంలో ఒలింపిక్‌ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో షబ్బీర్‌ మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాటప్రకారం పాత కలెక్టరేట్‌ క్రీడా మైదానాన్ని ఎనిమిది ట్రాక్‌లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. నెలలోగా మాస్టర్‌ ప్లాన్‌ తయారు చేయించి గ్రౌండ్‌ ట్రాక్‌ పూర్తి చేయించాలని నిర్ణయించామన్నారు. వచ్చే నెలలో సీఎం రేవంత్‌ వస్తారని.. ఆయన చేతుల మీదుగా స్టేడియంల నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తామని తెలిపారు. జిల్లాలో క్రీడా సదుపాయాలను పెంచేందుకు, కోచ్‌ల నియామకానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రూ.500 కోట్లతో యంగ్‌ స్పోర్ట్స్‌ అథారిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. డ్రగ్స్‌ వంటివాటిని నిర్మూలించేందుకు క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. గత సీఎం కేసీఆర్‌ క్రీడలను ఖతం చేసి అందరికీ లిక్కర్‌ అలవాటు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో ముత్తెన్న, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్, డిప్యూటీ ఈఈ ప్రవీణ్, వెయిట్‌లిఫ్టింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గడుగు గంగాధర్, అథ్లెటిక్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల రత్నాకర్, టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి శేఖర్, అథ్లెటిక్స్‌ సంఘం కార్యదర్శి రాజాగౌడ్, బ్యాడ్మింటన్‌ సంఘం అధ్యక్షుడు కర్నాటి వాసు, ఉషూ తదితర క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఉషూలో రాణించిన క్రీడాకారులకు షబ్బీర్‌ అలీ రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే క్రీడామైదానాన్ని కాపాడుకోవడానికి కృషి చేసిన సీనియర్‌ క్రీడాకారులు సయ్యద్‌ఖైసర్, రామర్తి గోపిని ఆయన సన్మానించారు.

సమష్టి కృషి ఉంది



బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం క్రీడా మైదానాన్ని తరలించే ప్రయత్నం చేయగా.. క్రీడా సంఘాలు, క్రీడాకారులు, ఆయా పార్టీల నాయకులు, ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ మీడియా ఇలా అందరి సహకారంతో అడ్డుకున్నాం. మా సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో స్టేడియం నిర్మాణమవుతుంది.

– కేశ వేణు, నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు

కాంగ్రెస్‌తోనే సాధ్యం



జిల్లా కేంద్రంలో 400ట్రాక్‌తో పాటు 8లైన్‌లతో స్టేడియం నిర్మాణం షబ్బీర్‌అలీ, మహేశ్‌ కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌ రెడ్డితోనే సాధ్యమవుతుంది. 8లైన్‌లతో ట్రాక్‌ ఉంటే జాతీయస్థాయి అథ్లెటిక్‌ ట్రాక్‌ నిర్వహించడానికి ఆస్కారం ఉంటుంది. క్రీడల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం.

– సయ్యద్‌ ఖైసర్, జాతీయస్థాయి గోల్డ్‌ మెడలిస్ట్‌

ఐక్యంగా ముందుకు వెళ్దాం



జిల్లాలో స్టేడియంల నిర్మాణానికి క్రీడా సంఘాలు, సీనియర్‌ క్రీడాకారులు అందరం కలిసి ముందుకు వెళ్దాం. గత ప్రభుత్వం క్రీడలకు అన్యాయం చేసింది. ఒలింపిక్‌ భవన స్థలాన్ని సైతం రక్షించాలన్నారు.

– బొబ్బిలి నర్సయ్య, ఒలింపిక్‌ సంఘం జిల్లా కార్యదర్శి

జీతం అక్కడ.. విధులు ఇక్కడ



ఇటీవల జిల్లా కేంద్రంలో కలెక్టర్, అడిషనల్‌ కలెక్టర్‌ హెల్త్‌ సెంటర్లను తనిఖీ చేసిన సమయాల్లో డీఎంహెచ్‌వో వెనుక ఉన్న బాల్కొండ మెడికల్‌ ఆఫీసర్‌

- డీఎంహెచ్‌వో వెంటే బాల్కొండ మెడికల్‌ ఆఫీసర్‌
- షాడోగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగుల ఆవేదన

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యశాఖ అధికారిణిగా రాజశ్రీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి షాడో డీఎంహెచ్‌వోగా ఓ మెడికల్‌ ఆఫీసర్‌ చెలామణి అవుతున్నాడు. గత నెల రోజులుగా మెడికల్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహించకుండా జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే పబ్బం గడుపుతున్నాడు. డీఎంహెచ్‌వో తనిఖీలకు వెళ్లినా, సమీక్షలు చేపట్టినా షాడో లేకుండా ముందుకు కదలేని పరిస్థితి నెలకొంది. డీఎంహెచ్‌వో ఎక్కడికి వెళ్తే అక్కడ షాడో ఉండడంపై స్థానిక ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. షాడోగా వ్యవహరిస్తున్న బాల్కొండ మెడికల్‌ ఆఫీసర్‌ తన విధులను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

షాడో కనుసన్నల్లోనే..

డీఎంహెచ్‌వో కార్యాలయం ప్రస్తుతం షాడో కనుసన్నల్లోనే నడుస్తోంది. డీఎంహెచ్‌వో చాంబర్‌లోనే ఉంటూ ప్రతి ఫైల్‌ను పరిశీలిస్తు ఇలా కాదు.. అలా అంటు ఉద్యోగులపై మండిపడడంపై స్థానిక ఉద్యోగులు అతని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. డీఎంహెచ్‌వో ఉన్నా ఓ మెడికల్‌ ఆఫీసర్‌ ఇష్టా రాజ్యంగా వ్యవహరించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యశాఖలో షాడో వ్యవహారశైలిపై కలెక్టర్‌ దృష్టి సారించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి

నందిపేట్‌: సీజనల్‌ వ్యాధులు, విష జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య శాఖ అధికారిణి రాజశ్రీ ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డిప్యూటీ మెడికల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ రమేశ్, ఇతర అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలు, రోగులకు అందిస్తున్న సేవలు, పలు అంశాలపై చర్చించారు. గ్రామీణ స్థాయిలో అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. సమావేశంలో మండల వైద్యాధికారి ప్రవీణ్, సీహెచ్‌వో దేవన్న, పీహెచ్‌ఎన్‌ పద్మావతి, హెల్త్‌ సూపర్‌వైజర్‌ సురేందర్, భాస్కర్, ఆర్మూర్‌ సబ్‌ యూనిట్‌ అధికారి సాయన్న, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం.. సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీతాకుంచాల

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: కొలిక్కిరాని ఎన్నో సమస్యలు మధ్యవర్తిత్వంతో పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్‌ సునీత కుంచాల అన్నారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో మధ్యవర్తిత్వ కేంద్రాన్ని సీపీ కల్మేశ్వర్‌తో కలిసి గరువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కొలిక్కిరాని కుటుంబ వివాదాలు, ఆస్తి పంపకాల్లో అన్నాచెల్లెళ్ల మధ్య గొడవలు, రెండు సంస్థల వ్యాపారదేవీల్లో తగాదాలు, భార్యాభర్తల మనస్పర్ధలు ఇలా అనేక విషయాల్లో సత్వర పరిష్కారం దిశగా మధ్యవర్తిత్వ కేంద్రం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థకు కలెక్టర్, పోలీస్‌ కమిషనర్‌ సంపూర్ణ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. సెప్టెంబర్‌ 28న నిర్వహించే జాతీయ లోక్‌ అదాలత్‌కు న్యాయవాదులు, న్యాయార్థులు సహకరించి విజయవంతం చేయాలన్నారు. అనంతరం సీపీ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ.. మానవ సమూహాలలో నెలకొన్న ఆర్థిక, సామాజిక సమస్యలకు పరిష్కార వేదికలుగా మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ రాజ్‌కుమార్‌ సుబేదార్, న్యాయసేవా సంస్థ సూపరింటెండెంట్‌ రంగు వెంకట పురుషోత్తంగౌడ్, పారా లీగల్‌ వలంటీర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధితుడికి అండగా నిలిచిన 'మనోరమ' వైద్యులు



చికిత్స పొందుతున్న బసవరాజు

నిజామాబాద్‌నాగారం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన బాధితుడికి నగరంలోని మనోరమ ఆస్పత్రి అండగా నిలిచి ఉచిత వైద్యం అందిస్తోందని న్యూరో సర్జన్‌ కట్ట నరసింహ అన్నారు. ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిచ్కుందకు చెందిన బసవరాజ్‌ జూన్‌14న బడాపహాడ్‌ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కోమాలోకి వెళ్లాడు. మిత్రులు ఆస్పత్రిలో చేర్పించడంతో వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుడికి తల్లితండ్రులు లేకపోవడంతో గ్రామస్తులు కొందరు సహకారం అందించారని అన్నారు. ప్రస్తుతం అతని వద్దకు ఎవరూ రావడం లేదని అతని వైద్య చికిత్సలను నెలన్నర రోజులుగా ఆస్పత్రి భరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ. ఆరు లక్షల వరకు ఖర్చు చేసిందన్నారు. ప్రస్తుతం అతనిని పరిస్థితి బాగానే ఉందని, పక్కనే ఉండి చూసుకునే వ్యక్తులు ఉంటే మరింత కోలుకుంటారని వైద్యులు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- పేషెంట్‌ గదిలో పైకప్పు పెచ్చులూడిన ఘటన



పేషెంట్‌ వార్డు గదిలో ఊడిన పైకప్పు

బోధన్‌: సాలూర పీహెచ్‌సీలో గురువారం రాత్రి ఆరోగ్య కేంద్రంలోని పేషంట్‌ వార్డు గది పై కప్పు పెచ్చులూడి పడింది. పీవోపీ రాడ్‌లు పెద్ద శబ్దంతో హఠాత్తుగా కూలిపోయి పడిపోవడంతో వైద్య సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. పేషంట్‌ వార్డులో రోగులెవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రాణ ప్రమాదం తప్పింది. మరో గది కూలిపోయే దశకు చేరింది. దీంతో ఆస్పత్రికి తాళం వేశారు. ఘటన జరిగిన సమయంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, అటెండర్, ఒక రోగి ఉన్నారని వైద్యుడు డాక్టర్‌ జయప్రకాశ్‌ తెలిపారు. ఈ ఘటన సమాచారాన్ని జిల్లా వైద్యశాఖ అధికారికి సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్‌ సీజ్‌

నందిపేట్‌: మండల కేంద్రంలో గురువారం రవాణా శాఖ తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న అక్షర పాఠశాల బస్సును అధికారులు సీజ్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోటర్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బస్సులను ఫిట్‌నెస్‌ చేయించుకోవాలని, పాఠశాలల బస్సులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో పాఠశాల బస్సుకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు.

గోదావరిలో చేపల వేట



బాల్కొండ: ప్రాజెక్ట్‌ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను నిలిపి వేయడంతో యువకులు, స్థానికులు చేపల వేట చేపట్టారు. నీటి విడుదల తగ్గగానే చేపలు బయటకు రావడంతో వాటిని పట్టుకునేందుకు యువకులు, మత్స్యకారులు పోటీపడ్డారు. చేపలు పట్టిన మత్స్యకారులు పలువురు వ్యాపారులకు విక్రయాలు చేపట్టారు.



నిర్దేశిత సమయంలో సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్‌ కిరణ్మయి

వర్ని/రుద్రూర్‌: నిర్దేశిత సమయంలో ఓటరు జాబితా సవరణ సర్వే పూర్తి చేయాలని బాన్సువాడ సబ్‌కలెక్టర్‌ కిరణ్మయి ఆదేశించారు. మండల కేంద్రంలో గురువారం రాత్రి ఆరు మండలాల తహసీల్దార్లు, ఐసీడీఎస్, బీఎల్‌వోలతో ఓటరు జాబితా సవరణపై సమీక్షించారు. ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు తదితర ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశానికి ముందు రుద్రూర్‌ తహసీల్‌ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సవరణ సర్వే వివరాలను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్లు శాంత, మారుతి, మల్లయ్య, గంగాధర్, సాయిలు, వెంకటేశం, ఐసీడీఎస్, బీఎల్‌వోల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



లింగమణి మృతదేహం

ఖలీల్‌వాడి: మనస్తాపంతో అనారోగ్యానికి గురైన ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నాలుగో టౌన్‌ ఎస్సై ఉదయ్‌కుమార్‌ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నాలకల్‌ రోడ్డుకు చెందిన లింగమణి(49) భోజారాం దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా వివాహాలు అయ్యాయి. మూడేళ్ల క్రితం భోజారాం అనారోగ్యంతో మృతి చెందాడు. నాటి నుంచి లింగమణి అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె మనస్తాపంతో బాత్‌రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పెద్ద కుమార్తె ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



నాగిరెడ్డిపేట: వారిద్దరు అన్యోన్య దంపతులు.. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచి జీవనం సాగించారు. ఇంతలో విధి వారిబంధాన్ని విడదీసింది. దాంతో భర్తకు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. ఈ ఘటన మండలంలోని గోపాల్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. గోపాల్‌పేటకు చెందిన ఎరుకల నారాయణ(38) అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య మంజులతో పాటు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేక పోవడంతో భర్తకు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. కాగా అందరితో కలుపుగోలుగా ఉండే నారాయణ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అమర జవాన్‌ స్థూపాన్ని ఢీకొన్న కారు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఉన్న అమరజవాన్‌ స్థూపాన్ని బుధవారం రాత్రి ఓ కారు ఢీకొన్నది. మద్యం మత్తులోనే కారు డ్రైవర్‌ స్థూపాన్ని ఢీకొన్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు గురువారం తెలిపారు. కాగా డ్రైవర్‌ కారును వదిలేసి పారిపోయినట్లు పేర్కొన్నారు.

భాగ్యనగర్‌లో చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: ఒకటో డివిజన్‌ ఖానాపూర్‌ పరిధిలోని భాగ్యనగర్‌లో చోరీ జరిగింది. ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యనగర్‌కు చెందిన లావణ్య ఇంట్లో బుధవారం రాత్రి దుండగుడు చొరబడి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడన్నారు. నిందితుడు ముఖానికి మాస్క్‌ ధరించి వివరాల సేకరణ కోసం వచ్చి చోరీకి పాల్పడ్డాడని బాధితురాలు పేర్కొంది. లావణ్య భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మామిడిపల్లిలో..

ఆర్మూర్‌టౌన్‌: మామిడిపల్లిలో ఉన్న తిరుమల కాలనీలో ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన మహేశ్‌ పనినిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. చోరీకిలో నాలుగు తులాల బంగారం, కొంత నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ పేర్కొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బోధన్‌ టౌన్‌: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను విధిస్తూ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ తీర్పు వెల్లడించారని బోధన్‌ టౌన్‌ సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. పట్టణంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



రవీందర్‌రెడ్డి(ఫైల్‌)

మోపాల్‌: డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్‌ గ్రామానికి చెందిన బూర్గుపల్లి రవీందర్‌రెడ్డి(51) తన వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహ్మద్‌ షరీఫ్‌ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రవీందర్‌రెడ్డి రోజువారీగా ఉదయం తన పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడం, ఫోన్‌ చేస్తే స్పందించక పోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూశారు. పొలంలో విగతజీవిగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. మృతుడి భార్య ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..

వర్ని: విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని జలాల్‌పూర్‌ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకన్న(55) అనే రైతు తన పొలానికి వెళ్తుండగా పొలంలోని విద్యుత్‌ తీగలు ప్రమాదవశాత్తు తగిలాయి. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు పొలంలో చూడగా విగతజీవిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కారు ఢీకొని..



సత్యం(ఫైల్‌)

దోమకొండ: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని కారు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గజం సత్యం(55) కూలీ పని కోసం అంచనూరు గ్రామానికి నడుచుకుంటు వెళ్తుండగా ప్రభుత్వ జూనియర్‌ కళాశాల సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొన్నది. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సత్యంను స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బావ రాజనర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, పిల్లలు లేరని బంధువులు తెలిపారు.

ఇద్దరి బైండోవర్‌



గాంధారి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా గతంలో గొడవలకు పాల్పడే ఇద్దరిని డిప్యూటీ తహసీల్దార్‌ రవి ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సంజయ్‌సింగ్, కోరే మల్లయ్యను బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.